# వేముగంటి బోజ్జెమ్మ

మన్నెపల్లి రామకృష్ణరావుగారు

ఈమహాపురంధ్రి పేరుప్రతిష్ఠ లెరుగనివారు నెల్లూరుప్రాంతముల నుండరు ఈమె వేముగంటి వేంకటరావుపంతులుగారి భార్య ఈమె పుట్టినిల్లు అనంతపురముజిల్లా తాటిపత్రి పుట్టినింటివారిపేరు కానులవారు ఈమె తలిదండ్రులపేర్లు తెలియలేదు ఈమె కొకచెలియలుండినది ఈమె పెద్దబొజ్జెమ్మ, ఆమె చినబొజ్జెమ్మ యని యింటివాడుక పేళ్లుండెనవి లోకమున కీయమ "బొజ్జెమ్మ"యనియే వాడుక వీరి పుట్టినింటివారిది కర్ణాటకమధ్వసంప్రదాయము భర్తగారిది దేశస్థమధ్వసంప్రదాయము. బొజ్జెమ్మగారి జననకాలము స్పష్టముగ తెలియలేదు ఈమె 1880-వ సంవత్సరమున స్వర్గస్థురాలయినటుల దెలియుచున్నది అప్పటికీమెకు 97 సంవత్సరములట. దీనినిబట్టి జననకాల మూహ్యమగుచున్నది ఈమె చిన్నప్పటినుండియు దైవబ్రాహ్మణభక్తి గలిగి తలిదండ్రులయెడ వినయవిధేయలతోడను, శ్రద్ధాభక్తులతోడను వర్తింపుచు ఇరుగుపొరుగునను యందరికి ప్రీతిపాత్రమై యుండినది ఈమె తండ్రిగారు కుంఫిణీబహదర్ వారి దివాణములో కడపతాలూకా ♦శిరస్తదారుగనుండిరి వేముగంటివారిది చాల పేదకుటుంబము ప్రథమములో వీరికుటుంబము మైసూరురాజ్యములో రాజకీయోద్యోగమున నుండిరనియు హైదర్ టిప్పుసుల్తాన కల్లోలములలో వీరికుటుంబము మైసూరురాజ్యమున నుండ వలనులేక కొంతకాల మచటనచట ప్రచ్ఛన్నముగానుండి కుంఫిణీప్రభుత్వ మాప్రాంతముల వ్యాపించినపిదప అజ్ఞాతవాసమువదలి సంచరింపగలిగిరనియు తెలియుచున్నది. వేంకటరావుగారితండ్రి రామదాసుగారు-తల్లి *రిందమ్మ వేంకటరావుగారు పసితనమునుండియు చురుకుదనమును స్వాశ్రయబలమునుగలవారు కుటుంబభరణము కష్టముగనుండగ వీరు పిల్లవాండ్రాడుకొను †పుట్టచెండ్ల సొగసుగగట్టి దానిపైన నందముగ రంగులదారములతో పువ్వులనమర్చి వాని నమ్మి వచ్చినపైకము తల్లిగారియొద్ద నిచ్చుచుండెడివారు

కొంత పెద్దవారయిన పిదప వేంకటరావుగారు కుంఫిణీసర్కారు యుద్యోగమును సంపాదించు కోరికతో కడపతాలూకాలో పైనజెప్పిన తాలూకాశిరస్తదారుని ప్రాపున ఉమ్మేద్వారిగ (వాలంటీయరు) జేరిరి ఆకాలమున తాలూకాశిరస్తదారునకు అధికారమును, పలుకుబడియు ఇప్పటికంటె నెక్కువగ నుండినవి "పురాహి సిద్ధాన్యుపలక్షితాని"యనినటుల వీరు వేంకటరావుగారి తెలివితేటల నుపలక్షించి వీరికి కచ్చేరిపనుల జక్కగ నేర్పుచు వీరియెడల విశేషప్రీతి గలిగియుండిరి ఆకాలమున నొకకుంఫిణీసేన యెటనుండియో వచ్చుచు పెన్నదాటి కడప జేరవలసి యుండినది తాలూకాకు తాఖీదులువచ్చినవి తెల్లవారు నప్పటికి తహసీల్ దారు మొదలు తలారివరకు శిబ్బందియంతయు యేటియొడ్డునజేరి నదీతరణమునకు వలయు సంభారోపకల్పనముల నందించుచుండిరి సేనయంతయు దాటినది సేనానాయకులును జిల్లాకలెక్టరువారును యెక్కిన ‡యరిగోలనై పుదప్పి ప్రవాహమునబడి సాగరోన్ముఖమయినది గట్టుమీది యుద్యోగస్థులు అర్థాత్ తటస్థులయి భ్రాంతులై ఒకరిమొగము నొకరు జూచికొనుచు ఏమిచేయుటకును తోచక చిత్రార్పితులవలె నిలిచిరి ధీరులును కార్యశూరులునగు వేంకటరావుగారు నడుముగట్టి నీటదుమికి సంద్రపుత్రోవంబట్టిన యాబుట్టనుబట్టుకొని దానిని సురక్షితముగ గట్టుజేర్చిరనియు, ప్రాణరక్షణబొందిన ఆప్రభువులు వారిని మెచ్చి యుద్యోగమునకు సిపా

---

(♦) ఈయుద్యోగమున కిపుడు తాలూకాబోర్డుహెడ్డుఅక్కౌంటెంటు అని పేరు

(*) ఇది బృందావనశబ్ద వికృతి దీనికె బ్రిందమ్మయను రూపాంతరమును కలదు

(†) లబ్బరు (Rubber) చెండ్ల నెరుగని యాప్రాతకాలము గచ్చకాయకు గుడ్డపేలికల గుండ్రముగ జుట్టి పైన రంగులదారములతో పూలనుతీగెలను కుట్టుచుండిరి పుట్టచెండు-పుట్టము (గుడ్డ) + చెండు.

(‡) వెదురుతోగాని పేముతోగాని పెద్దపెద్ద బుట్టలనల్లి వానిపై తోలుకుట్టి ఆబుట్టల కొన్నిచోట్ల పడవలుగ వాడుదురు వీనినె యరకాలుఅనియు, పుట్టీలుఅనియు జెప్పుదురు

రిషు నేసిరనియు అంతట వేంకటరావుగారికి కడపయందే గుమాస్తాగిరి మొదలు తహసీల్దారువరకు పదవిక్రమక్రమముగ లభించినదనియు వారి కుటుంబమువారు జెప్పెదరు వీరు కడపతాలూకాలో నుండగనే ఉదాహృత శిరస్తాదారుగారు శ్రీమతి బొజ్జెమ్మగారినిచ్చి వీరికి వివాహముజేసిరి పెండ్లిఅయిన కొలదికాలమునకే బొజ్జెమ్మగారు గృహిణీధర్మనిర్వర్తనమునకై భర్తృసంసారమున జేరిరి వేంకటరావుగారు కడపయందుండగనే వీరెరిగిన యధికారియొకరు తిరుచనాపల్లికి బదలాయింపబడిరి. ఆకాలమున శ్రీరంగములో తెంగలి వడగలి కలతలుపొసగి ఆయల్లరులనణుప సమర్థుడగు తహసిల్దారు కావలసివచ్చినది పైనజెప్పిన జిల్లాఅధికారి వేంకటరావుగారి ధైర్యస్థైర్యములనెరిగినవాడై వారినటకు తహసిల్దారుగ తెప్పించుకొనిరి వీరచటికేగి యాగజకచ్ఛపుంగ్రామంబున బ్రవేశించి అల్లరినణచి యచిరకాలమున శాంతిగలుగజేసిరి వీరు అచటనుండగనె ఆమాండాలికాధికారి విశాఖపట్టణమునకు మార్చబడినారు ఆజిల్లాయందలి మన్యములలోని (agency-tracts) కోయిదొరలు, భిల్లులు పూర్తిగ లోబడక అంతటంతట చిన్నచిన్న యుపద్రవముల కల్గించుచుండెడివారు వానిసణగ ద్రొక్కుటకయి వేంకటరావుగారు విశాఖపట్టణమునకు పంపించబడిరి అచట జేరినకొలదికాలముననె కోయీలభిల్లుల పశంసదులజేసి వారిపితూరీల నణచివేసిరి వీరచటనేయుండి హెడ్డుశిరస్తాదారు పదవింబొందిరి తరువాత కొంతకాలమునకు వీరు నెల్లూరుజిల్లా కలెక్టరు హెడ్డుశిరస్తాదారుగ బదలాయింపబడి ఇచటనే పెద్దయిల్లు కట్టించుకొని స్థావరమేర్పరచుకొని ఇచటనే ఆయుద్యోగమునుండి పెన్షన్ బుచ్చుకొనిరి వీరి పెన్షన్ నెలకు రు 350 లని దెలియుచున్నది వీరు మహారాష్ట్రభాషలో కవిత్వము జెప్పుచుండిరనియు, మహారాజా శివాజిఛత్రపతివారిచరిత్రమును, తమ జీవితవృత్తాంతమును అభాషలో వ్రాసియుంచిరనియు కొందరు జెప్పెదరు అట్టి వెచటను లభింపలేదు

వేంకటరావుగారు విశాఖపట్టణమున నుండగ నొకరాత్రి శ్రీమతి బొజ్జమ్మగారికి తులసీమహాదేవి ప్రత్యక్షమయి వీరుండిన ఇంటిదొడ్డిలో నొక పెంటదిబ్బలో తులసికోటయొకటి యున్నదనియు, దానినిదీయించి శుభ్రపరచి కళావాహనాదులుజేయించి దాని నారాధించుచుండమని యాజ్ఞాపించినదనియు, మరునాటియుదయమున నాదిబ్బను త్రవ్వించగ నందు దారుమయమగు తులసికోట దొరకినదనియు, దానిని మహాప్రసాదముగగొని యానాటినుంచియు యామె దాని నారాధింప మొదలిడినదనియు యప్పటినుండియు వారికి తతోధిక సంపదయు సంతానసౌభాగ్యము లుప్పతిల్లుచుండినవనియు దెలియుచున్నది బొజ్జమ్మగారి చిత్తవృత్తియంతయు నిరంతర మాముష్మికసాధనములమీదను ఇతరుల కుపకారముచేయుటయందును వ్రాలియుండినది. ఆకొనినవారి కన్నముబెట్టినది-భర్తతో సకలసంపదల ననుభవించి పుణ్యసంపాదనకై కడంగి యాగామి సంచితవాసనల నిర్మూలముచేయగల సత్యధర్మవర్తనలం దుత్సాహముకలిగి యుండినది ఆమె జరిగించిన గొప్ప ధర్మము లనేకములు గలవు-కొన్నింటిని జేర్కొనినజాలను

(1) మాధ్వులకు వ్రతానుష్ఠానములందాసక్తి యెక్కువగగలదు విశాఖపట్టణమునసుండగ ఏకాదశీసోమవారవ్రతమాచరించి తదంగముగ నుద్యాపనము జరిగించి నూటయెనిమిది ప్రత్యక్ష సవత్సగోదానముల జరిగించి భూరిదక్షిణలతోడను యన్నదానములతోడను పరమేశ్వరప్రీతిగ భూతతృప్తిజేసినదని ప్రసిద్ధిగలదు

(2) విశాఖపట్టణమునసే మార్కెట్టు సమీపమున నొకగుడికట్టించి అందు ముఖ్యప్రాణదేవరయగు శ్రీహనుమంతుని ప్రతిష్ఠించినది ఆదేవాలయమున పూజానైవేద్యములు జరుగుచున్నవని తెలియుచున్నది

(3) నెల్లూరి సంతపేటలో శ్రీఆంజనేయస్వామివారి వీధినుండి పినాకిని స్నానమునకుబోవు చాతుర్వర్ణ్య క్షేత్రస్థముగ నేటియొడ్డుననే యొక దేవాలయమును గట్టించి దానియందు వీరాంజనేయప్రసన్నాంజనేయమూర్తుల- రెండింటిని ప్రతిష్ఠజేసినది ఈదేవాలయమునందు నిత్యనైవేద్యపూజాదికముల నామె వంశస్థులొకరు జేయుచున్నారు

(4) ఈ దేవాలయము మొదలుకొని యుత్తరమున రంగనాయకులపేటలో నిపుడు మునిసిపల్ బాలుర బడి కట్టబడియుండు నివేశమువరకు ఏటియొడ్డుననే నానావృక్షశోభితమగు ఆరామము నొకదానిని నెలకొల్పినది దానియందీమె *ధాత్రీ సమారాధనలు సంతర్పణలు జరిగించుచుండినది ఈ వనముయొక్క యుత్తరపుకొన పైనజెప్పిన మున్సిపల్ స్కూలు ప్రక్కయందు హైరోడ్డువరకు వ్యాపించియుండినది ఈకొనభాగమున గొప్ప మామిడితోపుండినది రంగనాయకస్వామివారి తిరునాళ్ళకు వచ్చువారును, ప్రాయకముగ తిరుపతికి బోవు యాత్రీకులును ఈతోపున విడసి చెట్లనీడల మార్గాయాసశ్రమల దీర్చుకొనుచుండిరి ఈపెద్ద యారామమున చాలభాగము బహుధాన్యసంవత్సరపు (1874 అక్టోబరు) నెల్లువలో ఏటగలసినది అవశిష్టము కాలగతిచే నశించినది మామిడితోపుండిన ప్రదేశమున ఇప్పుడు మునిసిపల్ స్కూలును, మరియు మూడిండ్లును యేర్పడినవి బొజ్జమ్మగారివనము బాగుగనుండిన కాలమున యెండపొడదగులకుండ దట్టముగ రమ్యముగను యుండినది అచటనచట కపిలెబావులు ఉద్ధులు యేర్పడియుండినవి ఈపెద్దతోట యాద్యంతములు దాదాపు మూడు ఫర్లాంగులుండినది

(5) నెల్లూరు రంగనాయకులపేటలో రాజవీధికి పడమటివైపున పెద్దసత్రమొకదానినీమె గట్టించినది ఇది కాశీరామేశ్వరములబాటలో నుండుటచే యాత్రికులకత్యంతోపయోగముగనుండినది. ఇది పయినజెప్పిన మామిడితోపునకు దక్షిణమున కొలదిదూరముననున్నది సత్రము చాల శిథిలమైనది కొంతభాగమున్నది దానిని ఈమె సంతతివారొకరు కాపాడుచున్నారు ఈసత్రము నీమె సంతతివారు జీర్ణోద్ధారముజేసిన కీర్తిగ నుండగలదు ఈసత్రపుటావరణమున బొజ్జమ్మగారొకయరుగును వేయించిరి బ్రహ్మోత్సవకాలమున శ్రీరంగనాయకస్వామివారాయరుగుమీద వేంచేయునటుల యామె యేర్పాటుజేసినది ఇది ఇప్పటికిని జరుగుచున్నది

(6) శ్రీరంగనాయకస్వామివారి దేవాలయమునకు పడమటి యేటియొడ్డున నీమె యొక పెద్దయరుగును గట్టించి దానిమీద నొకబృందావనమును స్థాపించినది సన్నిధిరేవున స్నానములకుబోవువారిని సంధ్యావందనాదులు జేసికొనువారికిని ఈయరుగు బహుఉపయోగముగనున్నది.

(7) ఈపవిత్రురాలు నిర్వహించిన సత్కార్యములలో నవిచ్ఛిన్నముగను యనూనముగను యన్యూనముగను జరుగుచుండునది చిలుకుద్వాదశిగరుడోత్సవము – ఈ యుత్సవమునకు బొజ్జమ్మగరుడోత్సవమను పేరు రూఢియైనది – ఈద్వాదశినే క్షీరాబ్ధిద్వాదశీవ్రతాంగముగ యేకాదశ్యుపవాసము జరుపుటయు బ్రాహ్మణ బ్రాహ్మణిసహితముగ ద్వాదశిపారణ జరుపుకొనుటయు ఆరాత్రి శ్రీరంగనాయకస్వామి దేవేరులతోడ గరుడ వాహనారూఢుడయి బొజ్జమ్మగారియింటికి వేంచేయుటయు అచటస్వామివారికి సమస్తరాజోపచారదేవోపచారములు జరిగించుటయు గలదు శ్రీరంగనాయకస్వామి తమయింటి యల్లుడనియు అల్లుడాడుపడుచులతో కూడ నత్తగారియింటికి వచ్చుటయను నొకభక్తి కల్పనజేసికొని శ్రీస్వామివారికి భూషణాంబరముల నామె యిచ్చుచుండినది ఇప్పటివారు భూషణముల సమర్పించుచున్నారో లేదో తెలియదుగాని నూత్నవస్త్రముల జదివించుచున్నారు ఈ గరుడోత్సవము యథావిధిగ జరుగుచున్నది

(8) అనుదినమును శ్రీతులసీమహాదేవిపూజ కల్పోక్తప్రకారము ఆమె జరుపుచుండినది (ఈయాచారము నిప్పటికిని ఆయింటియాడువారు శ్రద్ధాభక్తులతో అనుష్ఠించుచున్నారు.)

(9) ఈయమ బాహ్యాంతరంగికప్రవృత్తులలో నంతయు నుత్తమోత్తమ మయినది పతిభక్తి పత్యుః పూర్వం సముద్ధాయేత్యాదికులస్త్రీ పాతివ్రత్యలక్షణములెన్నిగలవో వానినన్నిటిని నిర్వర్తింపుచుండినది. ఈ యిరువురి యన్యోన్యము నిరతిశయప్రక్రియ నుండినది

---

(*) కార్తికమున (ధాత్రి) యుసిరిక చెట్లుగల యారామమున సమారాధనముజేయుట సంప్రదాయము.

ఈమెకు నలుగురు కొమారులును అయిదుగురు కొమారితలును గలిగిరి. లోకముతోపాటీమెయు గర్భశోకము ననుభవించినది ఈమె నిర్యాణకాలమునకు ఒక్కపుత్రుడు ఇద్దరుపుత్రికలును మాత్రముండిరి పౌత్రదౌహిత్రాది సంపదనుగూడ జూచినది ఈమెసంతతి తామరతంపరలయి వర్ధిల్లుచున్నది మనినంతకాలము సమస్తసంపదల నోలలాడి మితిలేని దానధర్మములజేసి సౌమంగల్యసౌభాగ్యమున వెలసి పుత్రపౌత్రాది మురిపెముల నానందించి నిండుపయోభరమున యర్ధాంగమూర్తియగు భర్తగారి యంకమున తలనిడుకొని తులసీమహాదేవి ధ్యానముగావించుచు "నానుహోగిబర్తెను"యను చరమసూక్తముల యజమానునియొద్ద సెలవుబొంది 1880 సంవత్సరమున ననాయాసముగ శ్రీతులసీమహాదేవి నిత్యసేవకా సాధ్వీశిరోమణి తరలిబోయినది అప్పటి కీయమకు 97 సంవత్సరములని జెప్పిరి భర్తగారికి 102 డట. ఈయమ కడపటిపలుకుల వినినంతనే యాజరత్కారువు "నన్నెబిట్టుహోగితివా"యని బహువిధముల విలపించిరి బొజ్జెమ్మగారు కనుమూసిననాడు నెల్లూరుప్రజయంతయు మాతృహీనమయినటుల విచారము నొందినది దేహము వెంటవచ్చిన పసుపు కుంకములు పూలు తమలపాకులు చెవియాకులులోనగు సౌమంగల్యవస్తుప్రకరము చితివరకును త్రోవలనిండినవి క్రిందరాలినవానిని మహాప్రసాదముగ పలువురుస్త్రీలు గొంపోయిరి ఆమెగట్టించిన ఆంజనేయస్వామిదేవాలయమునకు నుత్తరపుప్రక్కన ఆమెభౌతికచిహ్నము సకలములగు నైదువమరియాదలతో నంతిమసంస్కారము బొందినది ఈదుఃఖముతో గృశించియావల రెండేండ్లకీమె భర్తగారును పురుషోత్తము స్థానము జెంది వియోగవిషాదమును బోనాడిరి ఈదంపతుల చరిత్రలకు దినవారాదిసంఖ్యానము లభింపలేదు వేంకటరావుగారు దాదాపు 35 సంవత్సరములు పెన్షను బుచ్చుకొనిరట వీరుచనిపోవునప్పటికి వీరికి 104 ఏండ్లట. అట్లగునెడల వీరిజననము 1778 ప్రాంతములనుండును ఈవిధముననే బొజ్జమ్మగారి జన్మకాలమును యూహ్యము కాగలదు ఈ జాయాపతులకు వయోభేదము అయిదేండ్లుగనుండును ఇందేమియు విపరీతములేదు సరిముదుసళ్ళను బిరుదమున కొప్పియుండిరి వేంకటరావుపంతులుగారు స్థూలదేహులు, దీర్ఘకాయులు, ఒడ్డుపొడవుగలవారు బొజ్జమ్మగారు మేలిమిబంగారువన్నెగలిగిన దేహకాంతిగలవారు కురచయాకృతి నాతిస్థూల నాతికృశ దేహయష్టిగలవారు, విశాలఫాలము. వారియింట్లతీరు ననుసరించి ముదుసలితనమునను జడవేసికొని చుట్టచుట్టుకొనువారు మరియు బుగడలు, ముక్కుపోగు నదాధరింతురు ఒక్కొక్కపుడు ముక్కుపోగును కమ్మ చెవికి దగిలించుకొనుటయు యొకవిలాసముగనుండెడిది ఈయమ ఏకాదశీ శుక్రవారములోనగు దేవోత్సవదినములందు ముఖ్యముగ శ్రీరంగనాయకస్వామిదేవాలయమునకు వచ్చుట యెల్లరకు దెలిసియుండి పిల్లలు పెద్దలు ఆదినములందు ఈమెరాక నిరీక్షించుచు బండియగుపడగనె పిల్లలు "బొజ్జెమ్మవస్తున్నది, బొజ్జెమ్మవస్తున్నది"యని ఎగురుచు కేకలువేయుచుండ అందరును వీధిలోనికివచ్చి ఈమెదర్శనముజేసికొని పోవుచుండిరి ఈమె యొకయొంటియెద్దుబండిమీద వచ్చుచుండినది. బండితోలువాడొకమాధ్వబ్రాహ్మణుడు భర్తగారి పేరునకంటెను ఈమె పేరునకు ప్రఖ్యాతిఅధికముగ గలదు ద్రవ్య మాయన యార్జనమైనను "బొజ్జమ్మగారి యిల్లు, బొజ్జమ్మసత్రము, బొజ్జమ్మదేవళము" ఇత్యాదినామములే ఊర్జితములయి నిలిచియున్నవి దేహము నశ్వరము ఆత్మ నిత్యుడనినటుల ద్రవ్య మపరమును సంకల్ప ముత్కృష్టమును అయినవి ఈమెజేసిన సత్కార్యముల నన్నిటను సంకల్పమీమెది అయినను భర్తగారి సమ్మతామోదపురస్సరముగ నవి జరిగినవి యని కారయిత్వత్వ మీవిధమున వీరియందనుక్తముగ ననుమేయమగుచున్నది తథాపి

"రామస్త్వత్సంగ్రహాద్దేవి దేవలోకేషుచశ్రుతః
సీతాభర్తేతిమాన్యోభూన్నృణాంభువివిశేషతః."

అను ప్రాచేతసోక్తి కిచట లక్ష్యమున్నదన్న కీర్తిమూర్తులగు వేంకటరావుపంతులుగారియెడ నపచారదోష మాపాదింపకుండుగాత!

—సం. శోధిని.